క్లుప్తంగా

శాకంబరిగా అన్నపూర్ణాదేవి



బోలాయపాలెం(కర్లపాలెం): అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం అన్నపూర్ణాదేవికి పలు రకాల కూరగాయలతో శాకంబరి దేవిగా అలంకరణ చేశారు. కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని, శాకంబరి దేవి అలంకరణలో ఉన్న అన్నపూర్ణాదేవిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు పరిమి బ్రహ్మానంద శర్మ అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



కొల్లూరు : పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు గ్లోరీ ఆర్గనైజేషన్ హోమ్ ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. ఆదివారం కొల్లూరు శివారు గాంధీనగర్‌లోని సుమారు 20 మంది విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, జామెట్రీ బాక్స్‌లు కొల్లూరు ఎస్ఐ జానకీ అమరవర్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో తెనాలి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బేతాళ ప్రభాకర్, అడ్వకేట్‌లు దాసరి సుధీర్, అశోక్, హైకోర్టు అడ్వకేట్, విజన్ ఆఫ్ హోప్ మిషన్ డైరెక్టర్ అమర్తలూరి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో దబ్బకూటి శివనాగరాజు మృతి



బాపట్ల: బాపట్ల అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ దబ్బకూటి వెంకట శివనాగరాజు (56) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. శివనాగరాజు విద్యార్థులకు మెరుగైన భోజనం అందించేందుకు కృషి చేసేవారు. విద్యార్థి దశ నుంచే మంచి క్రమశిక్షణతో విద్యార్థులు చదువుకోవాలని ఎన్నో అవగాహన తరగతులను నిర్వహించేవారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

రక్షణసైన్యం విద్యానగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు



బాపట్ల: బాపట్ల పట్టణంలోని రక్షణ సైన్యం విద్యానగర్ ఆధ్వర్యంలో ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేసి ప్రత్యేక ప్రార్థనలు ఆదివారం నిర్వహించారు. గృహ సమితి వారు, లీగ్ ఆఫ్ మెర్సీ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘ కాపరులు మేజర్ కె.యేసురత్నం, మేజర్ కె.రజని ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రోగులు త్వరగా ఆరోగ్యవంతులు కావాలని కోరారు.

చినపరిమిలో ఉచిత వైద్య శిబిరం



చుండూరు(వేమూరు): పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆర్థోపెడిక్స్ వైద్యులు నరేష్ రెడ్డి తెలిపారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో మైత్రీ ఆసుపత్రి, తెనాలి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. 110 మందికి ఉచితంగా పరీక్షలు చేశారు. మోకాళ్లు, కీళ్ల నొప్పులు, జాయింట్ నొప్పులు ఉన్న రోగులకు ఇంజక్షన్స్ చేశారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సాయి బాబ రెడ్డి, వేణు మాధవ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఈఈ శ్యామ్‌సుధాకర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అరవపల్లి రోడ్డు, పెనుమూడి రోడ్డు, జమీందార్ కోట, అంకమ్మచెట్టు సెంటరు, గూనివారిపాలెం, చిన్నఅరవపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమ్మవార్లకు బోనాలు సమర్పణ



చావలి గ్రామంలో అంకమ్మతల్లి ఊరేగింపులో భక్తులు



వెల్లటూరులో ఆలయానికి ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల దేవాలయంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు గత రెండేళ్లుగా బోనాల సమర్పణ కార్యక్రమం శాస్త్రయుక్తంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి సన్నిధిలో బోనాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని దేవస్థాన కమిటీ పర్యవేక్షించింది. అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. పూజా కార్యక్రమాలను క్రోవి రామకృష్ణ శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని భక్తి ప్రవత్తులు చాటుకున్నారు. అలాగే గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని మహిళలు సామూహిక కుంకుమ పూజలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మ తల్లి ఊరేగింపు

పెరవలి(వేమూరు): ఆషాఢ మాసం పురస్కరించుకుని విష్ణుమొలకల వారు అంకమ్మ తల్లి ఊరేగింపును ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెరవలి గ్రామంలో అంకమ్మతల్లి దేవస్థానం నుంచి చావలి, పెరవలి, పెరవలిపాలెం గ్రామాల్లో అంకమ్మతల్లిని ఊరేగించారు. అమ్మవారికి ఆషాడ సారె సమర్పణలో భాగంగా పసుపు కుంకుమలు, పండ్లు, వస్త్రాలు సమర్పించారు. అంకమ్మతల్లి గుడి వద్ద భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అంకమ్మ తల్లి ఊరేగింపులో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



వెల్లటూరులోని అమ్మవార్ల దేవాలయంలో బోనాలతో మహిళలు



ప్రత్యేక అలంకారంలో ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లు

నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

- కష్టపడి పని చేసేవారికి పార్టీలో గుర్తింపు లభిస్తుంది
- వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

రేపల్లె: నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన రేపల్లె పట్టణానికి చెందిన చిత్రాల ఓబేదుకు గుళ్ళపల్లిలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాటలో ఓబేదు నడుస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. పార్టీ కోసం, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన వారికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారిని గుర్తించి పదవులు కట్టబెడుతుందన్నారు. ఓబేదు సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించటం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో పార్టీ అభివృద్ధికి మరిన్ని సేవలు అందించాలని, శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఓబేదును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రేపల్లె, నగరం, చెరుకుపల్లి మండలాల కన్వీనర్‌లు కరేటి శేషగిరిరావు, ఇంకొల్లు రామకృష్ణ, దుండి వెంకట రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి కేవీ కృష్ణారెడ్డి, బాపట్ల జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సముద్రాల ప్రభుకిరణ్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దొంతిబోయిన కొండలురెడ్డి, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు వీసం నాగలక్ష్మి, నాయకులు పట్టెం శ్రీనివాసరావు, లియాఖత్ బాషా, ఆలా రాజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు స్మార్ట్ మోసాన్ని ప్రతి ఒక్కరూ ఎండగట్టాలి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్



వాల్ పోస్టర్‌లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

రేపల్లె: ప్రజలను నయవంచన చేస్తున్న చంద్రబాబు స్మార్ట్ మోసాలను ప్రతి ఒక్కరూ ఎండగట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ పిలుపునిచ్చారు. అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని కోరుతూ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన గోడ పత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లారు. అదానీ సంస్థ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను తమ ఇళ్లకు బిగించకుండా ప్రజలు అడ్డుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు వద్దు వాటిని పగలగొట్టండి అని చెప్పి కోర్టులో కేసులు వేసిన టీడీపీ నేతలు నేడు ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి అనేక రూపాల్లో విద్యుత్ చార్జీలు పెంచటం దుర్మార్గమైన చర్యన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలన్నారు. విద్యుత్ సంస్థ బిగించిన మీటర్ల రీడింగును సిబ్బంది ద్వారా తీయిస్తూ బిల్లులు వసూలు చేస్తోందని, సజావుగా జరుగుతున్న ఈ ప్రక్రియ కాకుండా అదానీ ప్రయోజనాలకు అనుగుణంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మండిపడ్డారు. పని చేస్తున్న మీటర్లను తొలగించి అదానీ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను పరిశ్రమలకు, వాణిజ్య సముదాయాలకు, చిరువ్యాపారులకు బిగించారనీ, ఇప్పుడు అపార్టుమెంట్లకు, ప్రజల ఇళ్లకు బిగించడానికి సిద్ధ పడ్డారన్నారు. ప్రజలపై అదనపు భారాలు పడే విద్యుత్ స్మార్ట్ మీటర్లను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రేపల్లె పట్టణంలో దశల వారీ పోరాటం చేస్తామని, పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీపీఎం పట్టణ శాఖ కార్యదర్శి కె.అగస్టీన్, నాయకులు కేవీ లక్ష్మణరావు, డి.అగస్టీన్, కె.రమేష్, కె.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వలివేరులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం



వలివేరులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

చుండూరు(వేమూరు): ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ పందిపాటి ఏసు అన్నారు. చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి ముఖ్యమంత్రి పదవి చేపట్టారని, తర్వాత వాగ్దానాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అమర్తలూరు ప్రవీణ్, మాజీ జెడ్పీటీసీ గాదె శివరామకృష్ణా రెడ్డి, మాజీ ఎంపీటీసీ దాట్ల మోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చీదెపూడి సాంబ రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ విప్పల వెంకట్రావురెడ్డి పార్టీ గ్రామ అధ్యక్షుడు పందిపాటి వెంకయ్య, అరమళ్ల వంశీకృష్ణ, దాసరి వసంతరావు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైస్తవ్యం సాక్ష్యంగా నిలవాలి

రెవరెండ్ డాక్టర్ కొల్లూరు లూథరన్ రిచర్డ్‌సన్



భట్టిప్రోలు: క్రైస్తవ్యం కేవలం సంఘంగా మాత్రమే కాకుండా సాక్ష్యంగా నిలవాలని రెవరెండ్ డాక్టర్ కొల్లూరు లూథరన్ రిచర్డ్‌సన్ పేర్కొన్నారు. భట్టిప్రోలులోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో వేదాంత కళాశాల విశ్రాంత అధ్యాపకులు రెవరెండ్ రిచర్డ్‌సన్‌కు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సంఘంకు ప్రపంచంలో ఘనమైన చారిత్రక నేపథ్యం కలదని తెలిపారు. భట్టిప్రోలులో స్థాపించబడిన దేవుని ప్రణాళిక, దేవుని పట్ల నమ్మకం కలిగి ఉండాలని సంఘస్తుల కరతాళ ధ్వనులతో ఘనంగా ఆహ్వానం చేశారు. రిచర్డ్‌సన్ ఎంతో మందిని తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక కాపరి, సంఘ పెద్దలు, స్త్రీల సమాజం అధిక సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక గురువు లూథర్ రిచర్డ్‌సన్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ కాపరి రెవరెండ్ దాసరి రవీంద్రవర్మ తదితరులు పాల్గొన్నారు.

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు



1998లో తెనాలిలో 'కోట'కు గోవిందరాజుల సుబ్బారావు అవార్డు ప్రదానం (ఫైల్)



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: తెలుగు సినీ రంగంలో ఒక విలక్షణ నటుడిగా నటించిన ప్రతి పాత్రకు జీవం పోసిన మహానటుడు కోట శ్రీనివాసరావు మరణం సినీ రంగానికే కాక తెలుగు ప్రజలకు కూడా విచారకరమని స్వరలయ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు లక్కరాజు సాయి అన్నారు. మారీసుపేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కోట శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కోట శ్రీనివాసరావుతో తనకున్న అనుబంధాన్ని సాయి గుర్తుచేసుకున్నారు. 1998లో సామాజిక సాంస్కృతిక సేవాసంస్థ 'స్పందన' తరఫున ప్రముఖ నటుడు గోవిందరాజుల సుబ్బారావు స్మారక అవార్డును కోట శ్రీనివాసరావుకు ప్రదానం చేసినట్టు ఆ కార్యక్రమ జ్ఞాపకాలను వెల్లడించారు. కోట తనకు రాసిన ఉత్తరం, ఆనాటి ఫొటోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నటులు హేమంత్, రమణయ్యలు ఉన్నారు.

మా–ఏపీ కార్యాలయంలో నివాళి

తెనాలి: తెలుగు సినిమారంగంలో 750 సినిమాల్లో నటించిన ప్రముఖ నటుడు ప్రత్యేకత మరెవ్వరికీ లేదని, ఆయన సినీడైలాగులు తెలుగునాట ప్రతి నోటా సజీవంగా ఉంటాయని మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. స్థానిక మా–ఏపీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం సినీ నటుడు కోట శ్రీనివాసరావు సంతాపసభ నిర్వహించారు. అక్కడే మీడియాతో మాట్లాడారు. కోట శ్రీనివాసరావు, ఎస్వీ రంగారావు వంటి నటులు తమ నటనతో తెలుగుప్రజల హృదయాల్లో నిలిచిపోయారని చెప్పారు. వెంకటేష్ హీరోగా నటించిన గణేష్ చిత్రంలోని ఆఖరి సన్నివేశంలో కోట నటన అత్యద్భుతమని గుర్తుచేశారు. అలాంటి గొప్ప నటులకు పద్మశ్రీ వంటి ప్రభుత్వ పురస్కారాలు రాకపోవటం దురదృష్టకమన్నారు. భారత ప్రభుత్వం దీనిని దృష్టిలో ఉంచుకుని కోట శ్రీనివాసరావుకు మరణం తర్వాతనైనా సముచిత అవార్డును ప్రకటించాలని విజ్ఞప్తిచేశారు. మా–ఏపీ సభ్యులు ఈదర వెంకట పూర్ణచంద్, కారుమూరు శివరామిరెడ్డి, రాబర్ట్, కొల్లూరు సామ్రాజ్యం, తన్నీరు రమణ, బసవరత్న, చినరాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెట్లు నరికి అమ్ముకుంటున్న టీడీపీ నాయకులు



చంపాడు(వేమూరు): కూటమి నాయకులు ఆదాయ వనరుల కోసం చెట్లను కూడా వదిలి పెట్టడం లేదు. వేమూరు మండలంలోని చంపాడు గ్రామంలో టీడీపీ నాయకులు కాలువ కట్ట వద్ద ఉన్న చెట్లు కొట్టి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆదాయం కోసం గ్రామంలో ఏది వదలి పెట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాలువల కట్టపై చెట్లు నరికి అమ్ముకుంటున్న వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వం, అధికారులు చెట్లు నరికి అమ్ముకుంటున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్‌గా సుభాష్‌దినకర్



బాపట్ల: లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్‌గా అత్తులూరి సుభాష్‌దినకర్‌ను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల ప్యాడిసన్ పేటకు చెందిన సుభాష్‌దినకర్‌ను కన్వీనర్‌గా నియమించటంతో పలువురు అభినందనలు తెలిపారు. పార్టీని క్షేత్ర స్థాయిలో అభివృద్ధి చేస్తానని సుభాష్‌దినకర్ చెప్పారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



ఉపాధ్యాయురాలికి పురస్కారం అందజేస్తున్న పీఠాధిపతి శివస్వామి



శివస్వామి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయురాలు నళిని

బాపట్ల: హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు హిందూ ఉపాధ్యాయులు కృషి చేయాలని తాళ్లాయపాలెం శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి పేర్కొన్నారు. హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో జరిగిన వ్యాస మహర్షి, హిందూ మిత్ర పురస్కార ప్రదాన కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఆచార్యులు, మాతాజీలు పాల్గొన్నారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో శివస్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. హిందూ ఘన చరిత్ర, ఇతిహాసాలు, హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని, హిందువులందరూ ఐక్యంగా ఉండి జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని శివస్వామి ఆకాంక్షించారు. వ్యాస పౌర్ణమి సందర్భంగా గురువులను సన్మానించడం ఆచరణీయ అంశమని పది సంవత్సరాల పాటు గురుపూర్ణిమకు తమ వంతు సాయం అందించామని తెలిపారు. జాతీయ అధ్యక్షులు మహేష్ డేగల రిజర్వేషన్‌లు, మత మార్పిడి, అట్రాసిటీ కేసు గురించి వివరించారు. పీఠాధిపతులు విద్యా వ్యవస్థ గురించి ఆలోచన చేయాలి అని కోరారు. ఉత్తమ ఉపాధ్యాయులకు హిందూ పరిరక్షకులకు కార్యక్రమ నిర్వాహకులకు వ్యాస మహర్షి పురస్కారం అందించి సన్మానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వర్ణ అజయ్ ఫణి శర్మ, జిల్లా అధ్యక్షులు ఎస్.రాంచంద్, వి.ప్రసాద్, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు ఉపాధ్యాయినులకు పురస్కారాలు

భట్టిప్రోలు : విద్యా బోధనతోపాటు, ధర్మ కార్యాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టే ఉపాధ్యాయులకు అందజేసే వ్యాసమహర్షి పురస్కారాలు భట్టిప్రోలుకు చెందిన ఇరువురు ఉపాధ్యాయినులకు దక్కడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతుంది. వేద వ్యాసుని జయంతి ఆషాడ పూర్ణిమ పురస్కరించుకుని బాపట్లలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయురాలు, ధార్మిక మండలి ధర్మచారిగా, సాధన మండలి అధ్యక్షురాలిగా పలు కార్యక్రమాలు చేపడుతున్న బూర్లె అరుణకుమారి, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిరంతం పాల్గొనే మద్దుల నళినిలకు వ్యాస మహర్షి పురస్కారాలు అందించారు. హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపాతి శ్రీ శివస్వామి ఇరువురు ఉపాధ్యాయినులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో అవ్వారు శ్రీనివాసరావు, డేగ మహేష్, దోగుపర్తి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాఢ బోనాలు



బోనాలు సమర్పిస్తున్న మహిళలు

రూరల్ మండలం కఠెవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. కనక తప్పెట్లు, మేళతాళాలు, దుర్గాదేవి వేషధారణలతో గ్రామోత్సవం నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ అర్చకులు జాజుల జగదీష్, గురుభవానీ జాజుల వెంకటేశ్వరరావు, పలువురు భక్తులు పాల్గొన్నారు. – తెనాలిటౌన్

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందజేత



కర్లపాలెం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరి గృహం దగ్ధమై నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చేయూత నందించాలని రెడ్డి సేవా మిత్ర అధ్యక్షుడు నంగు గోవర్ధన రెడ్డి కోరారు. శుక్రవారం సమ్మెట వారిపాలెంలో సమ్మెట శ్రీనివాసరెడ్డి గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగసి గృహం దగ్ధమైంది. ఈ ఘటనలో శ్రీనివాసరెడ్డి కుటుంబం సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న రెడ్డి సేవా మిత్ర అధ్యక్షుడు నంగు గోవర్ధనరెడ్డి స్థానిక సర్పంచ్ పిట్టు నాగాంజనేయరెడ్డితో కలసి కుటుంబాన్ని పరామర్శించి వంట పాత్రలు, దుస్తులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి సేవా మిత్ర సభ్యులు వీరారెడ్డి రమేష్‌రెడ్డి, బాబురెడ్డి, నాగేంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.